బుధవారం 09 అక్టోబరు 2024

ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/




# విలేకరులు కావలెను

RNI NO T/TG/2024/1093

Cell: 7013794396

అతితక్కువ కాలంలో 65వేలకు పైగా రీడర్ల మనసు దోచుకున్న ఇయ్యాల్టి న్యూస్ లోకల్ 2 గ్లోబల్ ... ఈ పేపర్ డైలీ పత్రికలో పని చేయుటకు తెలంగాణ వ్యాప్తంగా విలేకరులు కావలెను. కనీస విద్యార్హత కలిగి జర్నలిజంపె ఆసక్తి, తెలుగులో టైప్ చేయగలవారై ఉండాలి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలతో పాటు అన్ని మండలాల వారిగా విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత.. ఆసక్తి ఉన్న వారు వెంటనే సంప్రదించండి.

OFFICE ADDRESS
RRR MEDIA, PATELNGAR, AMBARPET, HYD-500013
email id.ramannews9@gmail.com






మోహినీ అవతారంలో గోవిందుడు.. తిరుమల భక్తులతో కిటకిట 2


చికెన్ ముక్క కొరికొనినట్లు అత్త చెవి కొరికేసిన కోడలు.. అతికించలేమన్న డాక్టర్లు.. 2లో


'కన్నా.. లేవరా! ఇంటికి పోదాం..' కొడుకు మృతి నమ్మలేక మృతదేహంతోనే తల్లి సంభాషణ 3లో


రెండు రోజుల పాటు లావోస్ పర్యటనకు ప్రధాని మోదీ 3లో


## రాష్ట్ర ప్రభుత్వం

# చారిత్రాత్మక నిర్ణయం

### గల్ఫ్ మృతులకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా..



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 8:తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం కమిటీ ఏర్పాటు చేసింది. గల్ఫ్‌లో కార్మికులు చనిపోతే వారి కుటుంబానికి 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనుంది ప్రభుత్వం. ప్రవాసి ప్రజావాణి పేరుతో ఫిర్యాదులను స్వీకరించనుంది. గురుకులాల్లో గల్ఫ్ కార్మికుల పిల్లలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.ఎండమావులు దాహం తీర్చలేవు.. ఎడారి దేశంలో పనికిపోతే అప్పులు తీరవు.. దీపానికి అట్రాక్ట్ అయ్యే పురుగుల్లా.. గల్ఫ్ దేశాలకు ఎగిరిపోయి.. అక్కడే పిట్టల్లా రాలిపోతున్నారు. అప్పులు తీర్చలేక.. పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబాలు పడే ఆవేదన వినే వారే కరువయ్యారు. స్థానికంగా ఉపాధి కల్పించని ప్రభుత్వాలు కనీసం పొరుగు దేశం నుంచి వారి శవాలను కూడా రప్పించలేకపోతున్నాయి. మోడు వారిని జీవితాల్లో ఏ రేడు వెలుగులు నింపుతాడోనని కళ్లలో వత్తులేసుకుంటున్నారు బాధితులు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గల్ఫ్ దేశాల్లో పనిచేస్తూ దురదృష్టవశాత్తూ మరణించిన తెలంగాణ ప్రవాసీ కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. దీనికి సంబంధించి జీవో నెంబర్ 216 ద్వారా అధికారిక ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి.

**కార్మిక సంక్షేమానికి తొలి అడుగు**

తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటిసారిగా గల్ఫ్ ప్రాంతాల్లో పనిచేస్తున్న వలస కార్మికుల సంక్షేమం కోసం ఈ విధమైన ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం గమనార్హం. ఈ నిర్ణయం లక్షల మంది గల్ఫ్ కార్మికులకు ఉపయోగపడనుంది.

**ఎవరికి వర్తిస్తుంది..?**

ఈ ఎక్స్‌గ్రేషియా బహ్రెయిన్, కువైట్, ఒమాన్, ఖతార్, సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి 7 గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్న తెలంగాణ వలస కార్మికులకు వర్తిస్తుంది. 2023 డిసెంబర్ 7 లేదా ఆ తర్వాత చనిపోయిన గల్ఫ్ కార్మికులకు ఇది అమలులోకి వస్తుంది. మరణానికి కారణం ఏదైనా ఈ పరిహారం వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది, అంటే సహజ మరణం, ప్రమాదం, అనారోగ్యం, లేదా ఏదైనా ప్రమాదకర పరిస్థితుల్లో మరణించిన వారికి ఇది వర్తిస్తుంది.

# జనాభా ప్రాతిపదికన ఎస్సీ వర్గీకరణ

### క్యాబినెట్ సబ్ కమిటీ కీలక సూచన





ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 8: ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఎస్సీ వర్గీకరణపై మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం మంగళవారం సచివాలయంలో సమావేశమైంది. ఎస్సీ వర్గీకరణ, కులగణన, తదితర అంశాలపై మంత్రులు చర్చించారు. ఎస్సీ వర్గీకరణపై 1,082 వినతులు, సూచనలు వచ్చినట్లు మంత్రులు వెల్లడించారు.పంజాబ్, తమిళనాడులో ఎస్సీ వర్గీకరణను అధికారులు అధ్యయనం చేశారని, జిల్లాల్లోనూ పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని సూచించారు. ఉపకులాల వారీగా ఎస్సీల వెనకబాటును, ఏకసభ్య జ్యుడిషియల్ కమిషన్ అధ్యయనం చేస్తుందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుంటుందని, కమిషన్‌కు ఉపకులాల వారీగా ఎస్సీ ఉద్యోగుల వివరాలు ఇవ్వాలని నియామక బోర్డులను ఆదేశించారు. బీసీ సామాజిక, ఆర్థిక సర్వే, ఓటరు గణన డిసెంబరు 9లోగా పూర్తిచేయాలని సమావేశంలో మంత్రులు నిర్ణయించారు.

### నెల రోజుల వ్యవధిలోనే పూర్తి చేయాలి: పొన్నం

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 8:స్థానిక సంస్థల ఎన్నికలకు కులగణన తప్పనిసరి కావడంతో వీలైనంత తొందరగా ఆ ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. కొత్తగా బీసీ కమిషన్ ఏర్పాటైన వెంటనే గత ప్రభుత్వంలో జరిగిన కసరత్తుపై రివ్యూ జరిగింది. దాదాపు నెల రోజులు కావస్తున్నా ఆ కార్యాచరణ ప్రారంభం కాకపోవడంతో దృష్టి పెట్టిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో మంగళవారం సమీక్షించారు. నిర్దిష్ట డెడ్‌లైన్ పెట్టుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించిన మంత్రి నెల రోజుల వ్యవధిలోనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కులగణన చేపట్టడానికి అనుసరించిన విధానాలపైనా ఈ సమావేశంలో స్టేట్ బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు, వివిధ శాఖల అధికారులతో మంత్రి లోతుగా చర్చించారు. ఇప్పటికే కర్ణాటక, బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు, బీసీ కమిషన్‌లు రూపొందించిన మార్గదర్శకాలను తెలంగాణ స్టేట్ బీసీ కమిషన్ అధ్యయనం చేసింది. ఈ మూడింటిలోని అనుకూల, ప్రతికూల అంశాలతో పాటు తెలంగాణకు ఏ పాలసీ అనువైనదిగా ఉంటుందో మంత్రి ఆరా తీశారు. ఈ మూడు రాష్ట్రాల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ఉత్తమమైన పాలసీని రూపొందించాలని ఆదేశించారు.కులగణనపై త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాకు వివరించారు. కులగణనపై కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలోనూ, బీసీ డిక్లరేషన్‌లోనూ స్పష్టమైన హామీ ఇచ్చిందని, దానికి తగిన యాక్షన్ ప్లాన్‌పైనా స్పష్టమైన అవగాహన ఉన్నదని, అందులో భాగమే కొత్త బీసీ కమిషన్ ఏర్పాటుతో పాటు వివిధ రాష్ట్రాల్లో పర్యటించిన చేసిన అధ్యయనం అని వివరించారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం పొందడంతో పాటు కేబినెట్‌లో కూడా విధాన నిర్ణయం తీసుకున్నదని మంత్రి గుర్తుచేశారు.

## ముగిసిన సీఎం ఢిల్లీ పర్యటన..

### హైదరాబాద్ కు రేవంత్ రెడ్డి



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 8: సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ముగిసింది. ప్రధానంగా సోమవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నేతృత్వంలో.. నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశ కార్యక్రమానికి హాజరయ్యేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లారు. ఆ సమావేశ అనంతరం.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతోపాటు, కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో ప్రత్యేక సమావేశం అయ్యారు. తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరద నష్టంపై కేంద్రం కేటాయించిన వరద సహాయాన్ని మరింత పెంచాలని అమిత్ షాను కోరారు. అలాగే విభజన చట్టంలోని హామీలను నెరవేర్చాలని, మరింత మంది ఐఏఎస్ లను రాష్ట్రానికి కేటాయించాలని కూడ సీఎం అమిత్ షాకు విజ్ఞప్తి చేశారు. ఇక ఖట్టర్ తో జరిగిన సమావేశంలో.. హైదరాబాద్ నగరంలో మురుగు నీటి శుద్ధీకరణకు నిధులు విడుదల చేయాలని, మెట్రో రెండో దశ పనులకు అనుమతులు ఇవ్వాలని విన్నవించారు. కాగా రెండు రోజుల హస్తిన పర్యటన ముగించుకున్న సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు.

## నిరుద్యోగులకు గుడ్ న్యూస్...


### విద్యుత్ శాఖలో ఉద్యోగాల భర్తీపై డిప్యూటీ సీఎం కీలక ప్రకటన



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 8: రాష్ట్రంలో నిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. విద్యుత్ శాఖలో త్వరలోనే ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఆ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ భర్తీ చేస్తామన్నారు. ఖమ్మం, వరంగల్ జిల్లాల విద్యుత్ శాఖ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. పదేళ్లుగా నిలిచిన పదోన్నతులను ఇప్పటికే పూర్తి చేశామని.. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజలు 1912 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. 'ఇటీవల వరదలకు నష్టపోయిన ప్రజలను ఆదుకునే చర్యలు చేపట్టాం. వరదల సమయంలో శ్రమించిన విద్యుత్ సిబ్బందికి అభినందనలు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేస్తాం. దసరా కంటే ముందుగానే పెండింగ్ బకాయిలు విడుదల చేస్తాం.' అని భట్టి పేర్కొన్నారు.

### పదివేల మంది మహిళలతో..

## ధూంధాంగా ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ సంబురాలు



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 8: రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ట్యాంక్ బండ్ పై 10 వేల మంది మహిళలతో బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు సి.ఎస్. శాంతి కుమారి ప్రకటించారు. రేపు 10వ తేదీన నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్ల పై మంగళవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులుతో మాట్లాడుతూ.. 10వ తారీఖు సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్మారక కేంద్రం నుంచి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారు. బతుకమ్మలతో పాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని.. ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసే వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని.. ఈ సందర్భంగా, బుద్ధ విగ్రహం, సంజీవయ్య పార్క్ నుండి ప్రత్యేకంగా ఫైర్ వర్క్స్, లేజర్ షో ల ప్రదర్శన ఉంటుందని ఆమె తెలిపారు.

### జమ్మూకాశ్మీర్ అభివృద్ధి కోసం

## ప్రజలతో కలిసి ముందుకెళ్తాం

### కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 8:జమ్మూకశ్మీర్ ఎన్నికల ఫలితాలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. జమ్మూ ప్రాంతంలో బీజేపీ విజయం చారిత్రాత్మకమని, గతంలో కంటే ఎక్కువ సీట్లు మరియు ఓట్లు పొందామన్నారు. జమ్మూ ప్రజలు మాతో ఉన్నారని మరోసారి నిరూపితమైందని, కాంగ్రెస్ ముక్త జమ్మూకాశ్మీర్ సాధనలో మేం విజయం సాధించామని కిషన్ రెడ్డి అన్నారు. కేంద్ర పార్టీ నాయకత్వ మార్గదర్శనంలో.. జమ్మూకశ్మీర్ రాష్ట్ర నాయకులు ఐకమత్యంతో అన్ని స్థాయిల్లో కష్టపడి పనిచేశారన్నారు కిషన్ రెడ్డి. జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో గతంలో ఎప్పుడు కూడా సంపాదించనన్ని ఎక్కువ సీట్లలో బీజేపీ పార్టీ ఈ ఎన్నికల్లో విజయం సాధించిందని, ఇకపై జమ్మూకాశ్మీర్ అభివృద్ధి కోసం ప్రజలతో కలిసి మరింత కష్టపడి పనిచేస్తామన్నారు.

## రాష్ట్ర బీజేపీకి గుడ్ న్యూస్..

### కేంద్రంలో ఈటల, అర్వింద్ కు కీలక పదవులు



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 8: పార్లమెంట్ కు చెందిన ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ జాయింట్ కమిటీలో ఈటల రాజేందర్ కు కీలక స్థానం దక్కింది. ఈ కమిటీ చైర్మన్ గా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు స్పీకర్ ఆమోదంతో లోక్ సభ సచివాలయం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 15 మందితో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో లోక్ సభ, రాజ్యసభ సభ్యులు మెంబర్లుగా ఉన్నారు. తెలుగు ఎంపీల్లో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కు సభ్యుడిగా ఛాన్స్ దక్కింది.

### దండగమారి పాలనలో పండుగ పూట కూడా పస్తులు..!

## రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ఫైర్



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 8: ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్ సర్కార్‌కు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది కనిపించడం లేదా..? అని కేటీఆర్ నిలదీశారు. ఈ మేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు.దండగమారి పాలనలో పండుగ పూట కూడా పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఐదారు నెలలుగా జీతాల్లేవ్ అని తెలిపారు. పంచాయతీ వర్కర్స్, మున్సిపాలిటీ కార్మికులు, ఆసుపత్రి సిబ్బంది, హాస్టల్ వర్కర్స్, గెస్ట్ లెక్చరర్స్.. ఇలా ప్రతీ శాఖలో వేతనాల్లేక చిరుద్యోగులు విలవిలలాడిపోతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.చిరుద్యోగులు కుటుంబాలను నెట్టుకురావడానికి అప్పులు చేసి నానా తిప్పలు పడుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఒకటో తారీఖునే జీతాలు ఇస్తామని పలికిన ప్రగల్భాలు ఎటుబాయె..? దసరా దగ్గరికి వచ్చింది..సరుకులు కొనడానికి చేతిలో నయాపైసా లేదు..! నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో డితే బతుకు బండి నడిచేదెట్లా..? 10 నెలల్లో తెచ్చిన రూ. 80 వేల కోట్లు అప్పులు ఎక్కడికి పోయినయ్..? చిరుద్యోగులు.. చిన్నజీతాల కార్మికుల అవస్థలను పట్టించుకోండి..వెంటనే వేతనాలు చెల్లించండి అని రేవంత్ సర్కార్‌ను కేటీఆర్ డిమాండ్ చేశారు.

ఈ-పేపర్ తెలుగు డైలీ
ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/
బుధవారం 09 అక్టోబరు 2024



## తెలంగాణలో మరో రెండురోజులు కొనసాగనున్న వానలు..

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 8:**తెలంగాణలో రాగల రెండురోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. మంగళవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వానలుపడే అవకాశం ఉందని చెప్పింది. బుధవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే, గురువారం నుంచి పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని వివరించింది.



## విద్యుత్ సిబ్బంది, అధికారులు పొలం బాట పట్టాలి: డిప్యూటీ సీఎం భట్టి

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 8: ఒక్క నిమిషం కూడా పవర్ పోకుండా చూస్తున్నామని, రైతులకి సోలార్ సిస్టం కూడా అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర అభివృద్ధి లో కరెంట్ పాత్ర చాలా ముఖ్యమైనదని, విద్యుత్ సిబ్బంది అధికారుల పాత్ర చాలా ప్రాధాన్యత వుంటుందన్నారు భట్టి విక్రమార్క. వ్యవసాయ పంపు సెట్ల ను నెలరోజుల్లోనే ఇస్తానని ఆయన తెలిపారు. అంతేకాకుండా.. విద్యుత్ సిబ్బంది అధికారులు పొలం బాట పట్టాలని, ఇక్కడ విద్యుత్ సమస్య రాకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. పొలాల్లో స్థంబాలు ఒరిగిపోకుండా చూడాలని ఆయన సూచించారు. ప్రజల ప్రాణాలు కూడా చాలా ముఖ్యమని, హ్యూమాన్ లాస్ ఎక్కడ జరుగవద్దని ఆయేన అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా మనం మారాల్సి వుంటుందని, విద్యుత్ శాఖ కు కూడా స్టాఫ్ కలశాల ఏర్పాటు చేయాలన్నారు. పంచ వ్యాప్తంగా సాంకేతికంగా వస్తున్న మార్పులు ఆ కళాశాల లో నేర్పించలసి వలసి వుంటుందని ఆయన అన్నారు. పదేళ్ల లో పెండింగ్ లో ఉన్న ప్రమోషన్ లు ఇచ్చామని, ఖాళీలు వున్న ప్రాంతాలని ఐడెంటిఫై చేశామని భట్టి విక్రమార్క తెలిపారు. సిబ్బంది నియామకం జరుగుతుందని ఆయన తెలిపారు.





దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అంబర్ పేట నియోజకవర్గం గోల్నాక డివిజన్ తిరుమల నగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి దేవాలయం లో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తాను దాతగా వ్యవహరించిన మహా అన్న ప్రసాద కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.

– ఇయ్యాల్టి న్యూస్,అంబర్ పేట, అక్టోబర్ 8



## ఆర్ఎంపీ, ఎంపీ అధ్యక్షుడిగా కర్రు సంపత్

ఇయ్యాల్టి న్యూస్, హనుమకొండ, అక్టోబర్ 8: తెలంగాణ రాష్ట్ర అర్ఎంపీ , ఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా నూతన కమిటీని మంగళవారం హనుమకొండ హంటర్ రోడ్డు దీపాభవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు నేతి రాజేశ్వర్ రావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పొనుగంటి హనుమంత రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రాజు, కట్ట అశోక్ , రాష్ట్ర కోశాధికారి శ్రీనివాస్ మూర్తి , కన్వీనర్ శ్రీనివాస్ తదితరుల ఆధ్వర్యంలో కొత్తగా ఎన్నికైన కమిటీ ప్రతినిధుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా కర్రు సంపత్, ప్రధానకార్యదర్శిగా పి.అగాస్టిన్, కోశాధికారిగా రమేష్, ఉపాధ్యక్షులుగా ఎం శివుడు, సి సంపత్, మల్లేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా సత్యనారాయణ, సారంగ పాణి , సహాయ కార్యదర్శులుగా రమేష్, దేవేందర్ రెడ్డి, నాగరాజు శంకర్, సురేందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సీహెచ్ శ్రీనివాస్ తదితరులను ఎన్నుకొని వారితో ప్రమాణ స్వీకారం చేయించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, అక్టోబర్ 8: అంబర్ పేట నియోజక వర్గం నల్లకుంట డివిజన్ కు చెందిన ఆర్.సునీత థైరాయిడ్ వ్యాధితో బాధ పడుతూ ఓ ప్రైవేటు దవాఖానలో ఆపరేషన్ చేయించుకుంది. ఈమెకు మాజీ మంత్రి హరీశ్ రావు సిఫారసు లెటర్ తో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 32వేల 500 మంజూరు కాగా.. మంగళవారం గోల్నాక కార్పొరేటర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నేత దూసరి శ్రీనివాస్ గౌడ్ బాధితురాలికి చెక్కును అందజేశారు.

## మోహినీ అవతారంలో గోవిందుడు..తిరుమల భక్తులతో కిటకిట



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, అక్టోబర్ 8: తిరుమల తిరుపతి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజైన మంగళవారం శ్రీ వేంకటేశ్వర స్వామివారు విశ్వ సుందరి మోహిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో ఈ రోజు కీలక ఘట్టం గరుడ సేవ ఉండనున్నందున తిరుమల కొండ భక్తులతో కిటకిలాడుతోంది. మరోవైపు శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతోంది. శ్రీనివాసుడు విశ్వ సుందరి మోహిని రూపంలో శృంగార రసాధి దేవతగా సర్వాలంకార భూషితుడై దర్శనమిచ్చారు. మోహినీ అవతారం.. మాయా మోహ నాశనం. ఈ అవతారం ద్వారా జగత్తు అంతా మాయామోహానికి లొంగివుందని, అదంతా తన లీలా విలాసమేనని, తన భక్తులు కానివారు ఈ జగన్మాయలోలులు కాక తప్పదని చాటి చెబుతున్నారని విశ్వాసం. విశ్వమంతా తన మాయ సృష్టి అని భక్తులకు సందేశం ఇస్తుంది. ఈ మాయను అధిగమించాలంటే అందరూ ఆయనను ఆరాధిస్తుంటారు. .



## అంబర్ పేట డివిజన్ లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, అక్టోబర్ 8: బీజేపీ ఓబీసీ మోర్చా అంబర్ పేట నియోజకవర్గ కన్వీనర్ ఎస్.వెంకటస్వామిగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం అంబర్ పేట నియోజకవర్గం అంబర్ పేట డివిజన్ పటేల్ నగర్ చౌరస్తాలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్, ఓబీసీ మోర్చా జిల్లా ఇంఛార్జి కాలేరు రామోజీ, ఓబీసీ జిల్లా అధ్యక్షులు సి.వినోద్ యాదవ్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చిని రమేష్, కాచిగూడ కార్పొరేటర్ ఉమా కన్నె రమేష్ యాదవ్ తదితరులు హాజరై స్థానిక ప్రజలకు బీజేపీ సభ్యత్వాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏడెల్లి అజయ్ కుమార్, కృష్ణ గౌడ్, డివిజన్ అధ్యక్షులు నాగభూషణంచారి, బిక్షపతి, యశ్వంత్, జి.మల్లేష్, మైలారం రాజు, తిరుపతి గుప్త తదితరులు ఉన్నారు.

## తాడెం జైకుమార్ నియామకం



ఇయ్యాల్టి న్యూస్,అంబర్ పేట, అక్టోబర్ 8: మినిస్ట్రీ ఆఫ్ ఫిషరీస్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమల మంత్రిత్వ శాఖల .అడ్మినిస్టేటివ్ కంట్రోల్ జాతీయ సభ్యునిగా అంబర్ పేట డివిజన్ కు చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు తాడెం జైకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం జై కుమార్ కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, ఎమ్మెల్యే రాజాసింగ్, యూపీ మాజీ రాజ్యసభ సభ్య జయప్రకాష్ నిషాద్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు..

## శ్రీ మహా గౌరిదేవీగా జైస్వాల్ గార్డెన్ మైసమ్మ

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, అక్టోబర్ 8: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అంబర్ పేట నియోజకవర్గం గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్ శ్రీశ్రీశ్రీ మైసమ్మ అమ్మవారు శ్రీ మహా గౌరీ దేవీగా భక్తులకు దర్శనిమిచ్చారు. నవరాత్రుల వేడుకల్లో హెూమం, కుంకుమ అర్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎన్.రమేశ్ గౌడ్, జి. ప్రసన్న ఆంజనేయులు, సి.యాదవ రెడ్డి, పి వెంకటేష్ గౌడ్, కె.దిలీప్ గౌడ్, పి శ్రీహరి చారి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఏ రామాగౌడ్, బి.మధుసూదన చారి, కె.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.





## డ్యూటీ మీట్ పోటీలతో వృత్తి నైపుణ్యం

### వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝూ

ఇయ్యాల్టి న్యూస్, హనుమకొండ, అక్టోబర్ 8: డ్యూటీ మీట్ పోటీల్లో పాల్గొనడం ద్వారా పోలీస్ అధికారులు తమ వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకొని మరింత రాణించగలరని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. రెండు రోజుల పాటు వరంగల్ పోలీస్ కమిషనర్ కార్యాలయములో నిర్వహించిన జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో విజయం సాధించిన పోలీస్ అధికారులకు ఆయన మంగళవారం పథకాలను అందజేశారు. భద్రాద్రి జోనల్ పరిధిలోని వరంగల్ కమిషనరేట్, ఖమ్మం కమిషనరేట్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ ఈ నెల మూడవ తేది నుండి మూడు రోజుల పాటు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు రవి, సంజీవ్, సురేష్ కుమార్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్రతో పాటు ఇన్ స్పెక్టర్లు, ఆర్ఐలు ఎస్ఐలు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

### చికెన్ ముక్క కొరికొనినట్టు

## అత్త చెవి కొరికేసిన కోడలు..

### అతికించలేమన్న డాక్టర్లు



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, అక్టోబర్ 8: కుటుంబ కలహాలు.. అత్తాకోడళ్ల మధ్య చిన్న చిన్న గొడవలు సహజం. అయితే, ఆ గొడవలు శ్రుతి మించితేనే ప్రమాదం. ఏపీ గుంటూరు జిల్లాలో అలాంటి ఘటనే జరిగింది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ కోడలు తన అత్త చెవి కొరికేసింది. గత ఆదివారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తుళ్లూరులో కంభంపాటి శేషగిరి, పావని (30) దంపతులకు ఇద్దరు కుమారులు. కొద్ది రోజులుగా పావని.. అత్త నాగమణికి (55) కుటుంబ కలహాలతో వివాదం నడుస్తోంది. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి గొడవ జరగ్గా.. ఆ సమయంలో కోడలు కోపంతో క్షణికావేశంలో అత్త చెవి కొరికేసింది. దీంతో అత్త చెవి భాగం మొత్తం ఊడిపోయింది. స్థానికులు ఆమెను, తెగిన చెవిని వెంటనే తుళ్లూరు పీహెచ్సీకి.. అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆలస్యమైందని.. తెగిన చెవిని అతికించడం కష్టమని వైద్యులు చెప్పినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఈ ఘటనపై ఇంకా కేసు నమోదు కాలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు.

### కోడలి పోలీస్ కంప్లైంట్..

## కుటుంబం మొత్తం ఆత్మహత్యాయత్నం..

### సికింద్రాబాద్‌లో విషాద ఘటన



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 8:కోడలు తమపై పోలీస్ కంప్లైంట్ ఇచ్చిందని.. ఆమె వేధింపులను కారణంగా చూపుతూ ఓ కుటుంబం మొత్తం ఆత్మహత్యకు యత్నించిన ఘటన సికింద్రాబాద్‌లో కలకలం రేపింది. త్రీ స్టార్ హెూటల్‌లో అపస్మారక స్థితిలో ఉన్న ముగ్గురిని గుర్తించిన హెూటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన నారాయణ (52), తల్లి పద్మావతి (47) దంపతుల కుమారుడు సృజన్ (23). ఈ ఏడాది ఫిబ్రవరి 14న ఈ దంపతులు కుమారునికి కావ్య అనే యువతితో పెళ్లి చేశారు. కొద్దిరోజులు వీరి జీవితం సాఫీగానే సాగింది. అనంతరం ఇరువురి మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే కోడలు కావ్య భద్రాద్రి జిల్లాలోని చెంచిపల్లి పోలీస్ స్టేషన్‌లో భర్త సృజన్‌పై ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అతనిపై 498%ూ% కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యులు అంతా కలిసి కోడలికి నచ్చచెప్పినా ఫలితం లేకపోయింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ముగ్గురు కుటుంబ సభ్యులు సికింద్రాబాద్ చేరుకుని తాజ్ త్రీ స్టార్ హెూటల్‌లోని 308 రూంలో బస చేశారు. తర్వాత కోడలికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసకుంటున్నట్లు చెప్పారు. అవమానం భరించలేమని జ్యూస్‌లో మత్తు పదార్థం కలిపి తాగారు. అయితే, అపస్మారక స్థితిలో ఉన్న ముగ్గురిని గుర్తించిన హెూటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి ముగ్గురిని వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వీరి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. మహంకాళి పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కోడలు కావ్య.. భర్త సృజన్‌పై పెట్టిన కేసు గురించి ఆరా తీస్తున్నారు.

# భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 8: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూలతలు, చైనా ఉద్దీపన చర్యల వంటి పరిణామాలతో మార్కెట్లు లాభాలను చవిచూశాయి. గత ఆరు సెషన్లుగా నష్టాలను మూటకట్టుకున్న మార్కెట్లు లాభాల బాట పట్టాయి. మంగళవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 584 పాయింట్లు లాభపడి 81,634కి చేరుకుంది. నిఫ్టీ 217 పాయింట్లు పెరిగి 25,013 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:అదానీ పోర్ట్స్ (4.76%), మహీంద్రా అండ్ మహీంద్రా (3.42%), రిలయన్స్ (2.01%), హెచ్డీఎఫ్సీ బ్యాంక్ (1.95%), ఎల్ అండ్ టీ (1.83%). టాప్ లూజర్స్:టాటా స్టీల్ (-2.89%), టైటాన్ (-2.59%), బజాజ్ ఫిన్ సర్వ్ (-2.27%), జేఎస్ డబ్ల్యూ స్టీల్ (-1.98%), బజాజ్ ఫైనాన్స్ (-1.12%).



# జమ్ముకశ్మీర్‌లో ఎన్‌సీ, కాంగ్రెస్ కూటమి విజయం

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 8: ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్ముకశ్మీర్‌లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్- కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. మ్యాజిక్ ఫిగర్ కన్నా రెండు సీట్లు ఎక్కువగా గెలుచుకుంది. ఎన్?సీ 42 చోట్ల, కాంగ్రెస్ 6 స్థానాల్లో విజయ దుందుభి మోగించాయి. బీజేపీ 29 సీట్లను సొంతం చేసుకుంది. పీడీపీ మూడు స్థానాలకు పరిమితమైంది. 10 స్థానాల్లో ఇతరులు గెలుపొందారు. అందులో ఒకరు ఆప్ అభ్యర్థి ఉన్నారు. ఆర్టికల్ 370 రద్దు, కేంద్ర పాలిత ప్రాంతంగా మార్పు వంటి నిర్ణయాల నేపథ్యంలో జరిగిన ఎన్నికల్లో జమ్ముకశ్మీర్ ప్రజలు ఎన్‌సీ- కాంగ్రెస్ కూటమివైపే మొగ్గు చూపారు. పూర్తి స్థాయి రాష్ట్ర హోదా సాధనకు కృషి చేస్తామన్న వాగ్దానాన్ని నమ్మి- ఆ రెండు పార్టీలకే పట్టం కట్టారు. పీడీపీ కూడా ఇలాంటి హామీలే ఇచ్చినా- గతంలో బీజేపీతో జట్టు కట్టడం వంటి పరిణామాల నేపథ్యంలో ఆ పార్టీని నమ్మలేదు. చరిత్రలో తొలిసారి జమ్ముకశ్మీర్ శాసనసభ ఎన్నికల్లో గెలుపొందింది ఆప్. దోడా నియోజకవర్గం నుంచి ఆప్ టికెట్‌పై పోటీ చేసిన మెహ్రాజ్



మాలిక్- బీజేపీ అభ్యర్థిపై గజయ్ సింగ్ రాణాపై 4,538 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. మొత్తానికి జమ్ముకశ్మీర్?లో హంగ్ ఏర్పడుతుందని ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు వేయగా, అందుకు భిన్నంగా ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి.

# హరియాణాలో బీజేపీ విజయఢంకా

## వరుసగా మూడోసారి అధికారం

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 8:** హరియాణాలో మరోసారి కమలం విజయం సాధించింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ బీజేపీ ముచ్చటగా మూడోసారి అధికారాన్ని చేజిక్కుంచుకుంది. మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలు గానూ 48 స్థానాలు గెలుచుకొని బీజేపీ హ్యాట్రిక్ కొట్టింది. ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ 36 సీట్లు కైవసం చేసుకుంది. ఐఎన్?ఎల్?డీ రెండు స్థానాల్లో, ఇతరులు మూడు స్థానాల్లో గెలుపొందారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఖాతానే తెరవలేదు. కౌంటింగ్ ఆరంభంలో ముందంజలో ఉన్న కాంగ్రెస్, కొద్దిసేపటికే రెండో స్థానానికే పరిమితమైంది.

### కాంగ్రెస్‌కు కలిసిరాని ప్రజా వ్యతిరేకత

పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడుతుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. కానీ ఫలితాలు మొత్తం తారుమారు అయ్యాయి. పదేళ్ల పాలనలో బీజేపీపై నెలకొన్న ప్రభుత్వ వ్యతిరేకత, రైతు చట్టాల నిరసనలు, రెజర్ల ఆందోళనలు, జాట్?ల అసంతృప్తి వంటి అంశాలు రాజకీయ అస్త్రాలుగా మారినా- అవి కాంగ్రెస్?ను గెలుపు దిశగా నడిపించలేకపోయాయి. జాట్?లు, ఎస్?సీ ఓటర్లు 40శాతం ఉన్నా, కాంగ్రెస్?కు కలిసిరాలేదు. రైతులకు కనీస మద్దతు ధర వంటి ఏడు గ్యారంటీలతో వరాలు జల్లు కురిపించినా ఆశించిన ప్రయోజనం లేకుండా పోయింది. ఎలాగైనా అధికారం చేపట్టాలని భావించిన కాంగ్రెస్?కు ఓటమి తప్పలేదు. కానీ బీజేపీకి గట్టి పోటీ ఇచ్చింది.



### బీజేపీకే ప్రజల మద్దతు

ప్రభుత్వంపై వ్యతిరేకత కనిపించినా ప్రజలు మాత్రం వరుసగా మూడోసారి మోదీ నాయకత్వానికే జై కొట్టారు. జాట్‌ల మద్దతు తగ్గడం వల్ల కలిగే నష్టాన్ని యాదవుల ఓట్లతో భర్తీ చేసుకోవాలని బీజేపీ విశ్వ ప్రయత్నాలు చేసింది. ముఖ్యంగా దిల్లీ చుట్టుపక్కల ఉన్న అహిర్వార్ ప్రాంతంలో యాదవుల ఓట్లను రాబట్టుకునేందుకు తీవ్రంగా ఆ పార్టీ కృషి చేసింది. అంతేకాకుండా మహిళలకు లక్ష్మి యోజన కింద మహిళలకు నెలకు రూ.2,100, రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల కల్పన, హర్? ఘర్ గృహిణి యోజన కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి హామీలతో ఓటర్లను ఆకట్టుకుంది. యువత, పేదలు, రైతులు, మహిళలను ఆకర్షించే విధంగా మేనిఫెస్టోను విడుదలచేసి ప్రజల మద్దతును సాధించింది.

# కన్నా.. లేవరా! ఇంటికి పోదాం..

## కొడుకు మృతి నమ్మలేక మృతదేహంతోనే తల్లి సంభాషణ

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 8: విధి కర్కశంగా ఆ ఇంటి దీపాన్ని ఆర్పేసింది. అప్పటి వరకూ అల్లరి చేస్తూ కేరింతలు కొడుతున్న కొడుకు ఒక్కసారిగా దూరమవడంతో ఆ తల్లి గుండె తట్టుకోలేకపోయింది. హిస్టీరియాటిక్‌గా మారిపోయింది. ఆసుపత్రి బెడ్‌పై కుమారుడి మృత దేహం పక్కన పడుకుని తన బాబు నిద్రపోతున్నాడంటూ ఆ తల్లి జోకొట్టసాగింది. బాబు నిద్ర నుంచి మేల్కొన్నాక అందరం ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లిపోతామనీ చెబుతోంది. అంతా చూస్తున్న పిల్లాడి తండ్రి కన్న పేగును మెలిపెడుతుంటే.. మరోపక్క భార్య పడుతున్న మానసిక వేదన భరించలేక బావురుమన్నాడు. రోడ్డు ప్రమాదంలో కన్న బిడ్డ మరణించాడని చెప్పడానికి శత విధాలా ప్రయత్నించాడా భర్త. కానీ.. నిర్జీవంగా పడుకుని ఉన్న పసివాడు లేచి మళ్లీ ఆమెను నోరారా 'అమ్మా' అని పిలవలేడనే విషయాన్ని మాత్రం తల్లి మనసు అంగీకరించలేక పోతుంది. బిడ్డ పక్కన పడుకుని 'కన్నా.. లేవరా ఇంటికి పోదాం' అంటూ ఆమె అంటున్న మాటలు అక్కడున్న ప్రతి ఒక్కరి గుండెను ద్రవింపజేసింది. ఈ విషాద ఘటన అన్నమయ్య జిల్లాలో సోమవారం (అక్టోబర్ 7) ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చోటు చేసుకుంది. అసలేం జరిగిందంటే..అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లి మండలం చిన్న ఓరంపాడుకు చెందిన బాబూరామ్, శిరీష దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న పిల్లాడు (3) ఇటీవల అనారోగ్యానికి గురవడంతో



ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు బయల్దేరారు. అయితే ఇంటి వద్ద పెద్ద కుమారుడిని ఒక్కడినే వదిలి వెళ్లలేక.. బైక్‌పై ఇద్దరు కుమారులను ఎక్కించుకుని భర్తతోపాటు ఆస్పత్రికి పయనమయ్యారు. అలా రాజంపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి ఇంటికి వెళ్తుండగా అనుకోని ప్రమాదం జరిగింది. బైక్ అదుపు తప్పి అందరూ రోడ్డుపై పడిపోయారు. దీంతో తండ్రి ముందు కూర్చున్న పెద్ద కుమారుడు శ్యామ్(5) ఎగిరి రోడ్డుపై పడ్డాడు. దీంతో బాలుడి తలకు తీవ్రమైన గాయం అయ్యి రక్తస్రావం అయ్యింది. స్థానికుల సహాయంతో హుటాహుటీన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శ్యామ్ మృతదేహాన్ని ఆసుపత్రిలో బెడ్‌పై ఉంచగా తల్లి శిరీష ఆ పక్కనే పడుకుని కుమారుడు నిద్రపోతున్నాడని, నిద్రలేచాక ఇంటికి వెళ్లిపోతామని భ్రమిస్తూ బిడ్డకు జోల పాడుతూ ఉండిపోయింది. చిన్నారి తండ్రి ఆమెను సముదాయించేందుకు ప్రయత్నించినా.. ఆమె మాత్రం పిల్లాడు నిద్రలేచాకే ఇంటికి వెళ్దామని చెప్పడంతో చేసేదిలేక అతనూ విలపిస్తూ ఉండిపోయాడు. ఈ దృశ్యం అక్కడున్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.

### పుట్టినరోజు నాడే విషాదం..

# ఐదేళ్ల చిన్నారి ప్రాణం తీసిన బర్త్‌డే కేక్!

### తల్లిదండ్రుల పరిస్థితి సీరియస్





ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 8: కొడుకు పుట్టిన రోజును ఇంటిల్లిపాది సంతోషంగా సంబరాలు చేసుకున్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి బర్త్‌డే కేక్ కట్ చేయించి ఒకరికొకరు ఆనందంగా తినిపించుకున్నారు. కానీ, వాళ్లకు తెలియదు.. బర్త్‌డే కోసం తెచ్చిన కేకే తమ కుమారుడి పాలి మృత్యుపాశంగా మారుతుందని.. బేకరీ నుంచి స్విగ్గీ ద్వారా ఆర్డర్ చేసిన కేక్ తిన్న చిన్నారి మృతి చెందాడు. ఇంట్లోని వారంతా అస్వస్థతకు గురయ్యారు.. బాలుడి తల్లిదండ్రుల పరిస్థితి విషమంగా ఉండటంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఐదేళ్ల చిన్నారి పుట్టిన రోజునాడే బర్త్‌డే కేక్ తిని మరణించటం పట్ల ప్రతి ఒక్కరూ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ విషాద సంఘటన కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో చోటు చేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళితే..కర్ణాటక రాజధాని బెంగళూరులో విషాద ఘటన వెలుగు చూసింది. ఐదేళ్ల బాలుడు కేక్ తిని మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటన కేపీ అగ్రహార పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ముగ్గురు వ్యక్తులు, తండ్రి, తల్లి, బిడ్డ అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరారు. స్విగ్గీ డెలివరీ బాయ్ కేక్‌ని ఇంటికి తీసుకెళ్లాడు. ఇంట్లో భార్య, బిడ్డతో కలిసి కేక్ తిన్నారు. ఈ కేక్ తిన్న తర్వాత ముగ్గురు అస్వస్థతకు గురయ్యారు. ముగ్గురిని స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స ప్రారంభించారు. తొలుత అస్వస్థతకు గురైన ఐదేళ్ల చిన్నారి ధీరజ్ వైద్య చికిత్సలకు స్పందించకపోవడంతో మృతి చెందాడు. తల్లిదండ్రుల పరిస్థితి విషమంగా ఉండడంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. కేక్‌ను తిన్న కుటుంబసభ్యుల ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించిందని తెలుసుకున్న ఇరుగుపొరుగువారు, స్థానికులు కేపీ అగ్రహార పోలీసులకు సమాచారం అందించారు. కేక్ కొనుగోలు చేసిన బేకరీపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

# 200 ఏళ్ల నాటి శాపం..

## ఇక్కడ మగవాళ్లు చీరలు కట్టుకుని దాండియా ఆడాల్సిందే..!



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 8: దేశవ్యాప్తంగా నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. నవరాత్రులలో దుర్గాపూజతో పాటు దాండియా, గర్బా నృత్యాలు జోరుగా నిర్వహిస్తారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు తమదైన రీతిలో పండుగను జరుపుకుంటు న్నాయి. ముఖ్యంగా నవరాత్రులంటే ముందుగా గుర్తుకు వచ్చేది గుజరాతీ గర్బా. ప్రతి సంవత్సరం నవరాత్రి తొమ్మిది రోజులలో గర్బా జరుగుతుంది. గుజరాత్ రాజధాని అహ్మదాబాద్ రంగులమయంగా మారుతుంది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ ఈ పండుగలో పాల్గొంటారు. గర్బాలో అందంగా డ్యాన్స్‌లు చేస్తారు.. అయితే గుజరాత్‌లోని ఓ గ్రామంలో మాత్రం గర్బా మరింత ప్రత్యేకం..ఎందుకంటే..ఇక్కడ పురుషులు చీరలు కట్టుకుని, ఆడవాళ్ళలా అందంగా తయారై గర్బా డ్యాన్స్ చేస్తారు. ఈ ప్రత్యేక గర్బా గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌లోని షాపూర్ ప్రాంతంలోని సాధు మాత గలి, అంబా మాత ఆలయంలో జరుగుతుంది. ఇక్కడ, నవరాత్రులలో ఎనిమిదవ రోజైన ఆంద్రీ అష్టమి రాత్రి, పురుషులందరూ స్త్రీల వేషధారణతో చీరలు కట్టుకుని, ఉత్సాహంతో గర్బా నృత్యం చేస్తారు. ఈ సంఘంలో దాదాపు 1000 మంది ఉన్నారు. వీరంతా ఆడవాళ్ల వేషంలో గుడిలో, వీధుల్లో గర్బా నృత్యం చేస్తారు. 200 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం: పురుషులు, మహిళల దుస్తులు, చీరలు ధరించి గర్బా ఆడే సంప్రదాయం సుమారు 200 ఏళ్లుగా కొనసాగుతోందని ఇక్కడి స్థానికులు చెబుతున్నారు. మగవారు ఇలా చీరలు కట్టుకుని గర్బలో పాల్గొనడం వెనుక ఒక ముఖ్యమైన కారణం ఉందంటున్నారు. బారోట్ కమ్యూనిటీకి చెందిన పురుషులను సదుబెన్ అనే మహిళ శపించిందని,ఆమె శాప విమోచనానికి గర్బా ప్రాయశ్చిత్తంగా నిర్వహిస్తారని చెబుతున్నారు.. ఈ కథ మొఘలులు భారతదేశాన్ని పరిపాలించిన కాలానికి సంబంధించినది. మొఘలుల దుష్ట దృష్టి సాదుబెన్ అనే మహిళపై పడింది. మొఘల్ రాజు ఆమెను తనతో పాటు తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. మొఘలుల నుండి తనను తాను రక్షించుకోవడానికి సదుబెన్ బారోట్ కమ్యూనిటీ సహాయం కోరింది. దురదృష్టవశాత్తు బారోట్ కమ్యూనిటీ పురుషులు ఆమెను మొఘలుల చేతుల నుండి రక్షించలేదు. దీంతో ఆమె బిడ్డ మృతి చెందింది. కోపోద్రిక్తుడైన సదుబెన్ బారోట్ కమ్యూనిటీ పురుషులను శపించిందని చెబుతున్నారు.. భావి తరాలు పిరికిపందలుగా మారతాయని శపించిందట. ఆ తరువాత ఆమె ఆత్మహత్య చేసుకుని చనిపోయిందని చెబుతున్నారు.

# రెండు రోజుల పాటు లావోస్ పర్యటనకు ప్రధాని మోదీ..

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 8: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పాటు లావోస్ పర్యటనకు వెళ్లబోతున్నారు. అక్టోబర్ 10, 11 తేదీల్లో ఆయన లావోస్‌లో పర్యటించనున్నట్లు భారత విదేశాంగ మంత్రిత్వశాఖ తెలిపింది. ఈ సందర్భంగా మోడీ 21వ ఆసియాన్- ఇండియా సమ్మిట్.. 19వ ఈస్ట్ ఏషియా సదస్సులో పాల్గొనున్నారు. ప్రస్తుతం ఆసియాన్- ఇండియాకు లావోస్ అధ్యక్షతగా బాధ్యత వహిస్తుంది. కాగా, ఈ సదస్సుల్లోనే భారత్ వివిధ దేశాలతో భాగస్వామ్య ప్రాంతీయ ప్రాముఖ్యం కలిగిన అంశాలపై చర్చించే ఛాన్స్ ఉందని విదేశాంగ మంత్రిత్వశాఖ చెప్పుకొచ్చింది. ఈ శిఖరాగ్ర సమావేశాల్లో భాగంగా నరేంద్ర మోడీ ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక విషయాలకు



సంబంధించిన సమావేశాల్లోనూ పాల్గొనున్నారు. యాక్ట్ ఈస్ట్ పాలసీ భారతదేశంలో వచ్చి దశాబ్దకాలం అవుతోంది. ఈ పాలసీ ఇండో-పసిఫిక్ అభివృద్ధికి కీలకమని విదేశాంగ శాఖ వెల్లడించింది.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/
బుధవారం 09 అక్టోబరు 2024



చూసి ముర్వాలే

## నాంపల్లి కోర్టుకు నాగార్జున ఫ్యామిలీ.. ఎవరెవరు వచ్చారంటే..?



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 8: టాలీవుడ్ నటి సమంతపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు సినీ, రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. నాగచైతన్య, సామ్ విడాకులపై కొండా సురేఖ మాట్లాడిన తీరుపట్ల సర్వత్రా వి వ ం ం ృ ల ం వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే సమంత, అక్కినేని కుటుంబానికి పలువురు మద్దతుగా నిలిచారు.

మంత్రి కొండా సురేఖ వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగార్జున ఆమెపై క్రిమినల్ కేసుతో పాటు, పరువు నష్టం దావా వేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి విచారణకు హాజరయేందుకు మంగళవారం నాంపల్లి కోర్టుకు చేరుకున్నాడు నాగార్జున. నాగార్జునతోపాటు అమల, నాగచైతన్య కూడా కోర్టుకు వచ్చారు. వీరితోపాటు సాక్షులు సుప్రియ, వెంకటేశ్వర్లు కోర్టుకు హాజరైన వారిలో ఉన్నారు. విచారణలో భాగంగా కోర్టు నాగార్జున స్టేట్‌మెంట్ రికార్డు చేశారు..



## బ్రహ్మముడి సీరియల్‌లో స్వప్నగా కొత్త క్యారెక్టర్..

### హమీదా ఎందుకు తప్పుకుందంటే..!

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 8: రీసెంట్ ఎపిసోడ్స్ లో కొత్త స్వప్న వచ్చింది.. హమీదా ఏమైపోయింది కొత్తమ్మాయిని తీసుకొచ్చారంటూ ఫ్యాన్స్ ఫీలైపోతున్నారు. అసలు హమీదా సడెన్ గా ఎందుకు తప్పకుందో అని డిస్కషన్ స్టార్ట్ చేశారుమంచి రేటింగ్స్ తో దూసుకుపోతున్న బ్రహ్మముడి సీరియల్ లో రాజ్ - కావ్య గా నటిస్తోన్న మానస్ - దీపిక రంగరాజుకి ఎంత ఫాలోయింగ్ ఉందో... స్వప్నగా నటిస్తోన్న హమీదాకు అంతే ఫాలోయింగ్ ఉంది.సెట్స్ లో హమీదా చివరి రోజు అంటూ బ్రహ్మముడిలో ప్రకాశ్ గా నటిస్తోన్న గిరి వీడియో పోస్ట్ చేశాడు. అసలు స్వప్న ఎందుకు తప్పకుందో చెప్పండంటూ...ఆ వీడియో కింద కామెంట్స్ హోరెత్తిపోతున్నాయ్..బిగ్‌బాస్ సీజన్ 8లో వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇవ్వనుందని అందుకే బ్రహ్మముడి నుంచి తప్పకుందనే టాక్ వినిపించింది. కానీ రీసెంట్ వైల్డ్ కార్డ్ ఎంట్రీల్లో హమీదా లేదు.. దీంతో బ్రహ్మముడి నుంచి హమీదా తప్పుకునేందుకు మరో కారణం ఉండొచ్చంటున్నారు.. హమీదా అందం, నటనతో స్మాల్ స్క్రీన్ ప్రేక్షకులను కట్టిపడేసింది. సో..ఏదైనా మూవీస్ లో అవకాశం వచ్చిందేమో..అందుకే సీరియల్ నుంచి తప్పుకుందేమో అనే టాక్ వినిపిస్తోంది. బ్రహ్మముడి సీరియల్ ఆరంభంలో నెగెటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్ చేసినప్పటికీ...రాను రాను చెల్లెలు కావ్యను చూసి మంచిగా మారింది.. అత్త రుద్రాణి, భర్త రాహుల్ కి గడ్డిపెట్టే క్యారెక్టర్లో హమీదాను చూసి స్మాల్ స్క్రీన్ ప్రేక్షకులు ఎంజాయ్ చేశారనే చెప్పాలి.సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే హమీదా.. గ్లామర్ డోస్ పెంచి మరీ ఫొటో షూట్స్ చేస్తుంటుంది..

## తెల్ల చీరలో... కేతికా శర్మ సొగసులు



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 8: హీరోయిన్ కేతికా శర్మ లేటెస్ట్ ఫొటోలతో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంటారు. తాజాగా తెలుగు రంగు చీరలో అందాలు ఆరబోస్తూ ఆమె తాజాగా జరిపిన ఫోటోషూట్ ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అవుతున్నది. ట్రెండ్ అవుతున్న అందాల భామ ఫోటోలపై మీరు ఓ లుక్కేయండి



## జబర్దస్త్‌లోకి మరో కొత్త జడ్జి.. బుల్లితెరపై బ్యూటిఫుల్ సినిమా జంట..



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 8: తెలుగు టీవీ షో జబర్దస్త్ ఎన్నో ఏళ్లుగా కామెడీ స్కిట్స్ తో ప్రేక్షకులని మెప్పిస్తున్న సంగతి తెలిసిందే. అయితే జబర్దస్త్ లో ఇటీవల అందరూ మారుతున్నారు. ఎంతో మంది కమెడియన్స్, జడ్జీలు, యాంకర్లు వచ్చి వెళ్తున్నారు. రోజా %-% నాగబాబు వెళ్ళిపోయాక రెగ్యులర్ గా జడ్జీలు, యాంకర్లు మారుతూనే ఉన్నారు. ప్రస్తుతం జబర్దస్త్ వారానికి రెండు ఎపిసోడ్స్ గా వస్తుండగా కొన్నాళ్లుగా కృష్ణ భగవాన్, కుష్బూ జడ్జీలుగా చేసారు. కానీ ఇటీవల కృష్ణ భగవాన్ స్థానంలో శివాజీ వచ్చారు. తాజాగా కుష్బూ స్థానంలోకి ఒకప్పటి హీరోయిన్ లయ వచ్చింది. ఒకప్పుడు హీరోయిన్ గా అనేక సినిమాలతో మెప్పించిన లయ పెళ్లి తర్వాత అమెరికా వెళ్ళిపోయి సెటిలయింది. మళ్ళీ ఇటీవలే రీ ఎంట్రీ ఇచ్చి ఇప్పుడిప్పుడే సినిమాలు చేస్తుంది. ఇలాంటి సమయంలో జబర్దస్త్ లోకి ఎంట్రీ ఇచ్చి అందర్నీ ఆశ్చర్యపరిచింది. శివాజీ కూడా బిగ్ బాస్ తో రీ ఎంట్రీ ఇచ్చి ఇప్పుడు వరుస సినిమాలు, సిరీస్ లు, షోలతో దూసుకుపోతున్నాడు. శివాజీ %-% లయ గతంలో మిస్సమ్మ, అదిరిందయ్యా చంద్రం, టాటా బిర్లా మధ్యలో లైలా, బ్రహ్మలోకం టు యమలోకం వయా భూలోకం.. సినిమాలలో కలిసి నటించి మెప్పించి హిట్లు కొట్టారు. వీరిద్దరిది వెండితెరపై మంచి పెయిర్. ఇప్పుడు ఈ జంట జబర్దస్త్ లో జడ్జీలుగా రావడంతో ప్రేక్షకులలో ఈ షోపై మరింత ఆసక్తి నెలకొంది. లయ జడ్జిగా వచ్చిన ఎపిసోడ్ ప్రోమో తాజాగా రిలీజ్ చేసారు. మీరు కూడా ఈ ప్రోమో చూసేయండి..

### ప్రభాస్ కింగ్ సైజ్ ఎంటర్‌టైన్‌మెంట్..

## మారుతి బర్త్ డే స్పెషల్ రాజాసాబ్ గ్లింప్స్ అదిరింది

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 8: గ్లోబల్ స్టార్ హీరో ప్రభాస్ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి రాజాసాబ్ . హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తోన్న ఈ చిత్రానికి మారుతి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇవాళ మారుతి బర్త్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ స్పెషల్ గ్లింప్స్ వీడియో విడుదల చేశారు. ప్రభాస్ గ్లామరస్ రోల్‌లో హార్రర్ కామిక్ టైమింగ్‌తో అదరగొట్టబోతున్నట్టు తాజా గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది. కింగ్ సైజ్ ఎంటర్‌టైన్‌మెంట్ అంటూ విడుదల చేసిన మేకింగ్ విజువల్స్ నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. ఈ చిత్రంలో మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్ , ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. అక్టోబర్ 23న ప్రభాస్ బర్త్ డే సందర్భంగా సర్‌ప్రైజ్ అనౌన్స్‌మెంట్ ప్లాన్ చేస్తున్నట్టు వార్తలు వస్తుండగా.. మేకర్స్ నుంచి ఏదైనా ప్రకటన వస్తుందేమో చూడాలి.ఇప్పటికే లాంచ్ చేసిన రాజాసాబ్ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. గ్లింప్స్‌లో ప్రభాస్ సూపర్ స్టైలిష్‌గా చేతిలో పూలబొకే పట్టుకొని అద్దంలో తనను తాను చూసుకుంటూ.. పూలు చల్లుతున్న సీన్లు అభిమానులను ఖుషీ చేస్తున్నాయి. ఈ చిత్రంలో సంజయ్ దత్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని 2025 ఏప్రిల్ 10న విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు.

## ఓవర్‌డోస్ గ్లామర్ షోతో..

### కుర్రకారును షేక్ చేస్తున్న ప్రియాంక మోహన్..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 8: నాచురల్ స్టార్ నాని హీరోయిన్ గా గ్యాంగ్ లీడర్ సినిమాతో టాలీవుడ్ లో అడుగుపెట్టింది ప్రియాంక మోహన్. ఇటీవల సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఫొటోలు నెట్టింట్లో తెగ వైరలయ్యాయి.



## ప్రెట్టీ పూనమ్ ఆ అందాలు... ప్రేక్షక లోకం సలామ్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 8: అందంతో ప్రేక్షకులను ఇప్పటికీ ఆకట్టుకుంటున్న సీనియర్ హీరోయిన్లలో పూనమ్ బజ్వా ఒకరు. ఆవిడ సోషల్ మీడియాలో షేర్ చేసిన తాజా ఫోటోలకు ప్రేక్షక లోకం సలాం అంటుంది.

PUBLISHED AND PRINTED BUY K.RAKESH. ON BEHALF OF RRR MEDIA ..Editor : **RR RATHNA**, Address.Patel Nagar Chowrastha, Amberpet, Hyderabad,Telangana - 500013.
**RNI NO. T/TG/2024/ 1093** ..Mobile No : 7013794396, 9949152838 ,Website : www.eyyaltynews.comEMAIL ..ramannews9@gmail.com.